# తాగుడు

చాలా రోజుల తరువాత తన ప్రాణ స్నేహితుడ్ని చూద్దామని వచ్చిన గుర్నాథం...మూసి ఉన్న తలుపుల్ని చూసి కాలింగ్ బెల్ నొక్కబోతూ లోపల్నుండి వినవస్తున్న సంభాషణ వింటూ అప్రయత్నంగా ఆగిపోయాడు.

"ఏవండీ...తాగొద్దండి...ప్లీజ్!"

"తాగుతాను. అయినా నీ గోలేంటి మధ్యన?" రంగనాథం గొంతు.

"ప్రొద్దుట్నుండీ చెప్తూనే ఉన్నాను. నా మాట పెడచెవిన పెట్టి మీ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారు. ఒక్కటే, ఒక్కటే అంటూ ఇప్పటికెన్ని గ్లాసులు తాగారో లెక్కలేదు."

"నీకేం తెలుసు ఇది తాగడంలోని మజా? అయినా నువ్విన్ని సార్లు చెప్పాల్సిన అవసరం లేదు. నా సంగతి నాకు తెలుసు. మాట్లాడకుండా వెళ్లు" కోపంగా రంగనాథం గొంతు.

"ఆ.. మీ సంగతి మీకు తెలుసు. తెలిసేనా డాక్టర్ తాగొద్దు... తాగితే పరిస్థితి వికటిస్తుంది అని గట్టిగా చెప్పినా వినకుండా గ్లాసులు మీద గ్లాసులు ఖాళీ చేస్తున్నారు."

బాటిల్ మూత తీసిన చప్పుడు.

గ్లాసులోకి ద్రవం జారుతున్న సవ్వడి.

"చూడు అరూ! ఎందుకంత వర్రీ అవుతావు? ఇప్పుడు నాకేమైందని? ఏదో కోరిక చంపుకోలేక తాగుతున్నాను అదీ ఎలా? ఇలా ఉన్నదున్నట్లు తాగుతున్నానా? కొన్ని మామూలు నీళ్లు కలుపుకునే తాగుతున్నాను కదా!"

"మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. మంచి కోరి చెప్తే మీ తలకెక్కడం లేదు. ఇంక వాదించడం శుద్ధ దండగ" కోపంగా అరుణ స్వరం.

గుర్నాథం తల గిర్రున తిరిగింది.

'రంగనాథం గాడికీ వ్యసనం ఎప్పట్నుండి పట్టుకుందబ్బా? డైరెక్ట్‌గా ఇంటికే తీసుకొచ్చి తాగడం దాకా వచ్చిందన్నమాట! పాపం అమ్మాయి అరుణ ఎలా వేగుతుందో వీడితో! వీడి దుంపతెగ! ఇన్ని గ్లాసులు తాగినా వాడికి నిషా తలకెక్కనట్లుంది. బానే మాట్లాడుతున్నాడు. అయినా దానికి బానిసైన వాడు రా(గ)నానూ బాటిల్స్ మీద



బాటిల్స్ ఖాళీ చేస్తేనే గానీ బ్యాలన్స్ తప్పడట. వీడ్ని గట్టిగా నాలుగు దులిపి పారెయ్యాలి. లాభం లేదు' లోపల సంభాషణ ఆగిపోవడంతో కాలింగ్ బెల్ నొక్కాడు.

రెండు నిమిషాల తర్వాత తలుపుతెరిచింది అరుణ.

"మీరా అన్నయ్యగారూ! రండి...రండి...ఏమండీ! గుర్నాథం అన్నయ్యొచ్చారు" అంది అరుణ.

లోపల గదిలో మంచంమీద అడ్డంగా పడి ఉన్న రంగనాథం లేచే ప్రయత్నం చేస్తుండగానే లోపలికి దూసుకెళ్లిన గుర్నాథం "ఒరే...ఇడియట్...ఫూల్...సిగ్గులేదర్రా నీకు? తెలిసి తెలిసీ చెడు వ్యసనాల బారిన పడి బంగారం లాంటి భవిష్యత్తును పాడుచేసుకుంటావా? పాపం...చెల్లాయి నీతో ఎంత కష్టపడుతుందో! ఆ అమ్మాయిని కష్టపెట్టకురా...ఆమె ఉసురు తగిలి పోతావ్! ఎప్పట్నుండీ అలవాటు? ఛీ...ఛీ నా స్నేహితుడు ఇంతగా చెడిపోయాడంటే నాకెంత బాధగా ఉందో తెలుసా?" రంగనాథం మీదున్న చనువుతో కోపంగా అరిచాడు.

తెల్లబోయాడు రంగనాథం.

"ఏవిట్రా? దేన్ని గురించి నువ్వు మాట్లాడేది?" అమితాశ్చర్యంతో అడిగాడు.

"అహాహా ఏం నటన? దేన్ని గురించిట! ఇందాకటి మీ సంభాషణంతా నేను విన్నాను.

ఫక్కున నవ్వింది అరుణ.

తేరుకున్న రంగనాథం కూడా అరుణతో జతకలిపాడు.

"ఏమిటా నవ్వులు?" అనుమానంగా అడిగాడు గుర్నాథం.

"అది కాదండీ అన్నయ్యగారూ! మేము కొత్తగా ఫ్రిజ్ కొనుక్కున్నాం. ఆయన కేమో టాన్సిల్స్ వాచాయి. డాక్టర్ చల్లని నీళ్లు తాగొద్దన్నారు. ఈయనేమో కొత్త మోజుతో ఫ్రిజ్ వాటర్ తప్ప మామూలువి తాగడం లేదు...అందుకని...."

ఈసారి తెల్లబోవడం గుర్నాథం వంతైంది.

**-బద్దిగం పాండురంగారెడ్డి (కరీంనగర్)**




